క్లుప్తంగా

ముమ్మరంగా పారిశుధ్య పనులు



పేడదిబ్బలను తొలగిస్తున్న అధికారులు

విజయపురం: మండలంలోని బూచివానత్తం పంచాయతీలో పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టారు. గురువారం కార్యదర్శి సంపూర్ణ జేసీబీ సాయంతో పేడదిబ్బలను తొలగించారు. రోడ్డుకు ఇరువైపులా ముళ్ల పొదలను తొలగించి, మురికి కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టారు. మురికి కాలువల్లో ఆయిల్ బాల్స్ వేశారు. చేతిపంపు, కొళాయి చుట్టు బ్లీచింగ్ చేశారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ మౌనిక

గంగాధరనెల్లూరు: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, చిత్తూరు జేసీఐ గోల్డ్ ఆధ్వర్యంలో తూగుండ్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం తాగునీటి చలివేంద్రంను డాక్టర్ మౌనిక చేతుల మీదుగా ప్రారంభించారు. గంగాధరనెల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స కోసం వచ్చిన గర్భవతులు, బాలింతలకు మధ్యాహ్న భోజనం అందజేశారు. డాక్టర్ ప్రవీణ్, రెడ్‌క్రాస్ మండల అధ్యక్షుడు పాపిరెడ్డి, ఎంపీ కేశవరెడ్డి, ఫౌండేషన్ చైర్మన్ శ్రీధర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి ఆర్.సహదేవ నాయుడు, పరిపాలన అధికారి పి.గోపి, జిల్లా కోఆర్డినేటర్ వి.చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

గాలీవాన బీభత్సం



రోడ్డుకు అడ్డంగా పడిన కొబ్బరి చెట్టు

శ్రీరంగరాజపురం: మండలం వ్యాప్తంగా గాలీవాన బీభత్సం సృష్టించింది. పెనుగాలుల కారణంగా పలు చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. మండలంలోని వెంకటాపురం, ఉడమాలకుర్తి, చిల్లామాకులపల్లి, పొదలపల్లి, పిళ్లారికుప్పం గ్రామాలు అంధకారంలో ఉన్నాయి. రోడ్లపై చెట్లు పడిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ



పంపిణీ చేసిన పరికరాలతో ఎంఈఓ

నగరి: విభిన్న ప్రతిభావంతులకు సహాయ ఉపకరణాలను ఎంఈఓ నమశ్శివాయం పంపిణీ చేశారు. గురువారం స్థానిక భవిత కేంద్రంలోని విభిన్న ప్రతిభావంతులకు 7 వీల్‌చైర్లు, బ్యాటరీ ఆపరేటెడ్ ట్రైసైకిల్ ఒకటి, రోలేటర్స్ ఐదు, వినికిడి యంత్రాలు ఐదు పంపిణీ చేశారు. వారి తల్లిదండ్రులకు పరికరాలను ఉపయోగించే విధానంపై అవగాహన ఏర్పరిచారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ హెచ్ఎం పార్వతీదేవి, సీఆర్పీ మునస్వామి, ఐసీడీఎస్ సిబ్బంది సంగీత, సహిత విద్య ఉపాధ్యాయులు భవాని, సంతోష్‌నాయక్, వాణి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన అవసరం



పోషకాహార నియమాల పద్ధతుల ప్రదర్శన

గంగాధరనెల్లూరు: బాలింతలు, గర్భవతులు, చిన్నారులు పౌష్టికాహారంతోనే ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ వినతశ్రీ అన్నారు. పౌష్టికాహార పక్షోత్సవంలో భాగంగా ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో పోషణ పక్వాడ కార్యక్రమాన్ని గురువారం ఐసీడీఎస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జీడీ నెల్లూరు గ్రామ సర్పంచ్ వీసీ సుబ్రహ్మణ్యం యాదవ్, ఏఓ భవాని, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో ప్రదోష కాల పూజలు



వెదురుకుప్పం: డీఆర్ ఎస్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరిపై ఉన్న శ్రీజ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో గురువారం ప్రదోష కాల పూజలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం నందీశ్వరుడికి పాలతో అభిషేకం చేశారు. ప్రదోష పూజలనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

వేసవి వల.. కోళ్లు విలవిల

జయలక్ష్మీపురంలో కోళ్ల ఫారంలో ఉన్న కోళ్లు



ప్రస్తుతం ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతుండడంతో కోళ్లు విలవిల్లాడుతున్నాయి. వేసవి తాపంతో అల్లాడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కోళ్ల సంరక్షణకు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి. లేనిపక్షంలో పెంపకందారులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. – పాలసముద్రం

- వేసవిలో కోళ్ల సంరక్షణ ముఖ్యం

ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నప్పుడు కోళ్లు తీవ్ర అస్వస్థతకు గురవుతాయి. ఉష్ణోగ్రత 18 నుంచి 21 డిగ్రీల మధ్య ఉంటే కోళ్లలో ఉత్పత్తి సామర్థ్యం బాగా ఉంటుంది. ఉష్ణోగ్రత 38 డిగ్రీలు దాటితే అనేక ప్రతికూల ఫలితాలు కనిపిస్తాయి. దాణా వినియోగం తగ్గుతుంది. గుడ్ల పరిమాణం, నాణ్యత కూడా నాసిరకంగా ఉంటుంది. మాంసం కోళ్లయితే బరువు తగ్గుతాయి. అధిక ఉష్ణోగ్రతల కారణంగా కోళ్లు ఎక్కువ సార్లు శ్వాస పీల్చుకుంటూ రొప్పుతూ ఉంటాయి. వడదెబ్బకు గురైన కోళ్లు 25 నుంచి 90 శాతం వరకూ మరణించే ప్రమాదం ఉంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా కోళ్లలో అనేక మార్పులు సంభవిస్తుంటాయి. ఈ మార్పులను కోళ్లఫారం యజమానులు ఎప్పటికప్పుడు జాగ్రత్తగా గమనిస్తూ వెంటనే తగిన చర్యలు తీసుకోవాలి. కొన్ని రకాల వ్యాధులు సోకిన కోడిపిల్లలు నీరసంగా కనిపిస్తాయి. మేత సరిగా తినవు. వ్యాధి సోకిన పిల్లలు నీరసంతో ఓ మూలకు చేరతాయి. చూడగానే అస్వస్థతకు గురైనట్లు కనిపిస్తాయి. నీళ్ల విరేచనాలు అవుతాయి. సరిగా నిలబడలేవు. వణుకుతుంటాయి. ఇలాంటి లక్షణాలు కనిపించగానే తగిన మందులు వేయించాలి.

ఇబ్బందులు తప్పవు

బ్రాయిలరైనా, లేయర్ కోళ్లయినా. వేసవిలో పెంపకదారులకు ఇబ్బందులు తప్పవు. బ్రాయిలర్ కోళ్లు చనిపోతే ఆర్థికంగా బాగా నష్టపోతారు. కోళ్లలో పెరుగుదల సరిగా ఉండదు. దీనివల్ల మాంసం ఉత్పత్తి తగ్గుతుంది. లేయర్ కోళ్లు చిన్న చిన్న గుడ్లు పెడతాయి. మంచి దాణా అందించినప్పటికీ కొన్ని కోళ్లు అసలు గుడ్లే పెట్టవు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఈ రెండు రకాల కోళ్లలోనూ వ్యాధులు ప్రబలుతుంటాయి.

రోగ నిరోధకశక్తి

వేసవిలో కోళ్లలో సహజంగానే వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. అందువల్ల అవి అనేక వ్యాధులు గురవుతాయి. అంటువ్యాధులు సైతం త్వరగా ప్రబలుతాయి. కోళ్లు అధిక ఉష్ణోగ్రతను తట్టుకోలేవు. శరీర ఉష్ణోగ్రత కంటే వాతావరణ



కోళ్ల ఫారంలో పది రోజుల కోడి పిల్లలు

ఉష్ణోగ్రత ఎక్కువగా ఉంటే కోళ్లు అయాసపడుతుంటాయి. మేత తక్కువగా తింటాయి.

షెడ్లలో తీసుకోవాల్సిన చర్యలు

కోళ్ల షెడ్లు ఇరుకుగా ఉండకూడదు. షెడ్లు ఎప్పుడూ పొడిగా. తేమ లేకుండా పరిశుభ్రంగా ఉండాలి. లిట్టర్ ఎత్తును తగ్గించి షెడ్డులో దుమ్ము, ధూళి లేకుండా చూసుకోవాలి. ఉష్ణోగ్రతను తగ్గించేందుకు షెడ్డు పైన కొబ్బరి ఆకులు, గడ్డి వంటి వాటిని దట్టంగా వేసి అప్పుడప్పుడూ నీళ్లు చల్లుతుండాలి. దీని వల్ల షెడ్డులో ఉష్ణోగ్రత ఐదు డిగ్రీల వరకూ తగ్గుతుంది. షెడ్డు కప్పు పైన తెల్లని రంగు వేసి కూడా ఉష్ణోగ్రత తగ్గించవచ్చు. షెడ్డు చుట్టూ నీడ వచ్చే చెట్లు పెంచడం మంచిది. ఈ చెట్లు షెడ్డుకు దగ్గరగా కాకుండా కనీసం పది అడుగుల దూరంలో ఉండాలి. షెడ్లలో కోళ్లను డీప్ లిట్టర్ పద్ధతిలో లేదా కేజెస్‌లో నిర్దేశించిన సంఖ్యలోనే ఉంచాలి. కేజెస్‌లో పెద్దకోడికి 0.75 చదరపు అడుగులు, డీప్ లిట్టర్‌లో అయితే రెండు చదరపు అడుగుల స్థలం ఉండాలి.

ఎక్కువ నీరు ఇవ్వాలి

కోళ్లు సహజంగానే వేసవిలో ఎక్కువ నీటిని తీసుకుంటాయి. అందువల్ల షెడ్లలో అదనంగా నీటి తొట్టెలు ఏర్పాటు చేయాలి. కోళ్లకు వీలైనంత వరకూ చల్లని నీటిని అందించాలి. నీటి ద్వారా సంక్రమించే వ్యాధులను నియంత్రించాలంటే కోళ్లకు పరిశుభ్రమైన నీటిని ఇవ్వాలి. కోళ్లు తాగే నీటిలో ఎలక్ట్రోలైట్స్, సి విటమిన్ వంటివి కలిపితే అవి ఒత్తిడికి గురికాకుండా ఉంటాయి. నీటి ట్యాంకు మీద గోనెసంచులు కప్పి వాటిని ఎప్పటికప్పుడు తడుపుతూ ఉండాలి. దీనివల్ల ట్యాంకుల్లోని నీరు వేడెక్కదు. ఉష్ణోగ్రత ఎక్కువగా ఉన్నప్పుడు కోళ్లపైన నేరుగా నీటిని పిచికారీ చేయవచ్చు. ఆర్థిక పరిస్థితిని బట్టి షెడ్డులో ఫాగర్లు స్ప్రింక్లర్లను ఏర్పాటు చేసుకోవాలి.

క్రమపద్ధతిలో దాణా

వేసవిలో కోళ్లు సాధారణంగా తక్కువ మేత తింటాయి. ఉష్ణోగ్రత పెరిగిన కొద్దీ నీరు ఎక్కువగా తాగుతాయి. నీరు ఎక్కువగా తాగినప్పుడు మేత సరిగా తినవు. అందువల్ల ఒకే సారి ఎక్కువ పరిమాణంలో దాణా ఇవ్వడం మంచిది కాదు. దాణాను కొద్దిగా తడిపి పెడితే మంచిది. ఎక్కువ తడిపితే దాణాకు బూజు పట్టే ప్రమాదం ఉంది. వేసవిలో కోళ్లు పగటి పూట సరిగా తినవు. ఉదయం 10 గంటల్లోపు, సాయంత్రం నాలుగు గంటల తర్వాత దాణా ఇస్తే ప్రయోజనం ఉంటుంది. దాణాలో అవసరమైన మోతాదులో విటమిన్లు, ఖనిజ లవణాలు ఉండేలా చూసుకోవాలి. మాంసకృత్తులు తగ్గించాలి. ఒత్తిడికి లోనైన కోళ్లకు సి-విటమిన్ మోతాదు పెంచాలి. ప్రతి టన్ను దాణాకు 200–300ల గ్రాముల సి-విటమిన్, 50 గ్రాముల ఇ-విటమిన్ కలపడం అవసరం. దీని వల్ల గుడ్ల నాణ్యత పెరగడంతోపాటు కోళ్లు బలంగా ఉంటాయి.

టీకాలు తప్పనిసరి



వాతావరణం చల్లగా ఉన్నప్పుడే కోళ్ల ముక్కులు కత్తిరించడం, టీకాలు వేయించడం, నట్టల నివారణ మందులు ఇవ్వడం వంటి పనులు చేయాలి. క్రిమిసంహారక మందులు పిచికారీ చేయాలి. కోళ్లవయసు, ఎండ తీవ్రతను బట్టి దాణాలో అమినో ఆమ్లాలు, విటమిన్లు, ఖనిజాల మోతాదు పెంచాలి. వేసవిలో తేలు, నల్లులు మొదలైన బాహ్యపరాన్న జీవుల బెడద కూడా ఎక్కువగానే ఉంటుంది. వీటి నివారణకు టీకాలు ఇప్పించాలి. వేసవిలో వచ్చే కొక్కెర రోగం వంటి వ్యాధుల నివారణకు ముందుగానే టీకాలు వేయించాలి. ఈ జాగ్రత్తలు పాటిస్తే వేసవిలో కోళ్ల ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచవచ్చు.

– చిత్తూరు పశుసంవర్ధక శాఖ జేడీ ప్రభాకర్

ఉపాధి నిధులు దుర్వినియోగం



పాత నీటితొట్టె పక్కనే మరో తొట్టె నిర్మాణం

పాలసముద్రం: మండలంలోని క్రిష్ణజమ్మపురం బస్‌స్టేషన్ సమీపంలో గతంలో నిర్మించిన నీటి తొట్టె పక్కనే ప్రస్తుతం ఉపాధి హామీ పథకంలో మరొక నీటి తొట్టె కడుతున్నారు. ఉన్న నీటి తొట్టె పక్కన ప్రస్తుతం ఉపాధిహామీ పథకంలో పశువులకు, మేకలు, గొర్రెల దాహార్తి తీర్చేందు నీటి తొట్టె నిర్మిస్తున్నారు. ఉపాధి హామీ అధికారులు కూడా కూటమి నాయకులు చెప్పినట్లు తీని తొట్టెలు కట్టి నిధులు దుర్వినియోగం చేస్తున్నారు. కొన్ని చోట్ల బలిజకండ్రిగ–చిత్తూరు జాతీయ రహదారి పక్కనే నీటి తొట్టెలకు భూమి పూజలు వేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి క్రిష్ణజమ్మపురం బస్‌స్టేషన్ సమీపంలో నిర్మిస్తున్న నీటి తొట్టెను వేరొక చోటికి మార్చాలని పాడి రైతులు కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కార్వేటినగరం: వైఎస్సార్ సీపీ నాయకుడు భాస్కర్ సతీమణి అముద అనారోగ్యంతో మృతి చెందింది. సమాచారం అందుకున్న రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి గురువారం గ్రామానికి వెళ్లి అముద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భాస్కర్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి వెంకటరత్నం, ఎంపీటీసీ ధనశేఖర్‌యాదవ్, లక్ష్మయ్య, మోహన్‌రెడ్డి, రవి, ఎడ్వర్డ్ తదితరులు పాల్గొన్నారు.



అముద చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు





గంగాధరనెల్లూరు: మాట్లాడుతున్న ఏఓ భవాని, పాలసముద్రం: అవగాహన కల్పిస్తున్న ఏఓ ఢిల్లీప్రసాద్

గంగాధరనెల్లూరు: ప్రకృతి వ్యవసాయం రైతులకు అధిక లాభదాయకమని మండల వ్యవసాయాధికారి భవాని అన్నారు. గంగాధరనెల్లూరు మండలంలోని సీడీపీఓ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ద్వారా చేపడుతున్న వార్షిక ప్రణాళికను వివరించారు. పీఎండీఎస్ పద్ధతిలో 25 నుండి 32 రకాల విత్తనాలు వేయడంతో కలిగే లాభాలను వివరించారు. సంఘంలోని ప్రతి మహిళ 365 రోజులు పెరటి తోటలు వేసుకోవాలని సూచించారు. డీఎంఎంటీ ధనలక్ష్మి ఏటీఎంఏ గ్రేట్ మోడల్ గురించి వివరించారు. కార్యక్రమంలో డ్వాక్రా సంఘం ఏపీఎం ఫరీద్ మస్తాన్, మాస్టర్ ట్రైనర్ విజయ్, ఎస్‌డీఏ సరిత, ఎస్‌బీఐ హేమావతి, రేవతి, ఐసీఆర్పీ రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, వెలుగు సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు శ్రేష్టం

పాలసముద్రం: ప్రకృతి వ్యవసాయంతో రైతులు తక్కువ ఖర్చుతో అధిక లాభాలు సాధించడం, ఆ ఉత్పత్తులతో ఆరోగ్యానికి మేలు చేకూతుందని మండల వ్యవసాయాధికారి ఢిల్లీప్రసాద్ తెలిపారు. గురువారం వెలుగు కార్యాలయంలో ఏపీఎం కల్పలత రెడ్డి, మాస్టర్ ట్రైనర్ ప్రతాప్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఏఓ ఢిల్లీప్రసాద్ మాట్లాడుతూ రసాయన క్రిమిసంహారక మందులు, ఎరువులు అధిక మోతాదులో వాడడంతో భూసారం దెబ్బతిని భూమి నిర్జీవంగా మారుతుందని హెచ్చరించారు. భూమి లేని వారు పెరటి తోటలు వేసుకుని కూరగాయలు, ఆకుకూరలు పండించుకోవాలని తెలిపారు. ఏపీఎం కల్పలతరెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా కలిగే ప్రయోజనాలను రైతులు తెలుసుకోవాలన్నారు. సర్పంచ్ మహేష్‌బాబు, ప్రతాప్, నిర్మల, మునియమ్మ, ఐసీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

13న గురుకులం ప్రవేశ పరీక్ష

గంగాధరనెల్లూరు: మండలంలోని సర్వేరెడ్డి పల్లి గురుకుల పాఠశాలలో ఈ నెల 13వ తేదీన 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరే విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ దమయంతి తెలిపారు. ఆమె మాట్లాడుతూ 13 తేదీ ఆదివారం ఉదయం 10 నుండి 12 గంటల వరకు ఐదో తరగతి విద్యార్థులకు, మధ్యాహ్నం 2 నుండి 4 గంటల వరకు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు పరీక్ష ఉంటుందన్నారు. ఈ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు హాల్ టికెట్లతోపాటు ఆధార్ కార్డు జిరాక్స్‌లను తీసుకురావాలని సూచించారు.

వైభవంగా కల్యాణోత్సవం



ప్రత్యేక అలంకరణలో శ్రీకామాక్షి సమేత కరకంఠేశ్వర స్వామి

నగరి: శ్రీకరకంఠేశ్వర స్వామి ఆలయంలో పంగుణోత్తర బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణోత్సవ వేడుకలు గురువారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉదయం హోమపూజలు నిర్వహించి మూలవర్లకు, ఉత్సవర్లకు అభిషేక అర్చనలు చేశారు. పౌర్ణమి తిథి, ఉత్తరానక్షత్రం, అమృత యోగంతో కూడిన తులాలగ్నంలో ఆదిదంపతులకు పంగుణోత్తర తిరుకల్యాణోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయంలో భక్తులకు కళ్యాణోత్సవ విందు ఏర్పాటు చేశారు. నగరి శివాలయ కమిటీ, ఎం.కస్తూరి కృష్ణారెడ్డి, ఏఎం రాధాకృష్ణ, శివాలయ అయ్యప్ప భక్త సంక్షేమ సేవాసంఘం వారు ఉభయదారులుగా వ్యవహరించారు. రాత్రి స్వామి, అమ్మవార్ల పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు కొబ్బరికాయలు కొట్టి, కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం, అర్చకులు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వన్‌సైడ్ పార్కింగ్‌కు ఏర్పాట్లు

– డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్

నగరి: పట్టణంలో వన్ సైడ్ పార్కింగ్ ఏర్పాటుకు ప్రత్యేక పథక రచన చేస్తున్నట్లు డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ అన్నారు. గురువారం నగరి స్టేషన్‌కు విచ్చేసిన ఆయన సీఐ విక్రమ్ సిద్ధం చేసిన వన్ సైడ్ పార్కింగ్ బోర్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో నగరి పట్టణంలో వన్‌సైడ్ పార్కింగ్ విధానాన్ని ప్రవేశపెడుతామన్నారు. టవర్ క్లాక్ జంక్షన్ నుండి పళ్లిపట్టు రోడ్డులోని కొత్తపేట అగర వినాయకస్వామి ఆలయం వరకు, ప్రకాశం రోడ్డులో మున్సిపల్ ఆఫీస్ వరకు ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగంగా వన్ సైడ్ పార్కింగ్ ఏర్పాటు చేయనున్నామన్నారు. దీనిపై వారం రోజులపాటు వాహనదారులకు అవగాహన కల్పిస్తామన్నారు. ప్రజలు, వాహనదారులు ఈ మార్పును గమనించి పోలీసులకు సహకరించాలన్నారు.



వన్‌సైడ్ పార్కింగ్ బోర్డులు చూపుతున్న డీఎస్పీ

కూటమి చిన్నచూపు

– దళితవాడ దారి నిర్మాణానికి అడ్డు

పెనుమూరు(కార్వేటినగరం): దళిత నియోజకవర్గంలో దళితులపై కూటమి నాయకులు పగబట్టి పీడిస్తూ, దళిత గ్రామాలకు రోడ్లు లేకుండా రోడ్డుపై ట్రెంచ్ కొడుతున్నారు. మరో దళితవాడకు దళితులు వెళ్లకుండా ఏకంగా రాళ్ల నాటి ఫెన్సింగ్ వేశారు. అదే కోణంలో నేడు సామిరెడ్డి పల్లి దళిత గ్రామానికి రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకుంటున్న ఘటనలు నియోజకవర్గంలోని పెనుమూరు మండలంలో ఎన్నికలు జరిగినప్పటి నుంచి కొనసాగుతున్నాయి. పెనుమూరు మండలంలోని సామిరెడ్డిపల్లి దళిత వాడలో 48 కుటుంబాలు నివశిస్తున్నాయి. అయితే అదే గ్రామానికి చెందిన కూటమి నాయకులు గత ఎన్నికల్లో దళితులు తమకు అనుకూలంగా లేకపోవడంతో వారిపై పగబట్టి గ్రామానికి వెళ్లకుండా రోడ్డుపై కంచె నాటారు. దీంతో తమ గ్రామానికి రాకపోకలు లేకుండా చేశారన్న ఆగ్రహంతో అధికారుల దృష్టికి తీసుకెళ్లి కంచెను తొలగించారు. రోడ్డు కోసం మంజూరైన నిధులతో గురువారం బీటీ రోడ్డు నిర్మించేందుకు పనులు మొదలుపెట్టారు. ఈ తరుణంలో కూటమి నాయకులు రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకున్నారు. అనంతరం ఆగ్రహంతో దళిత మహిళలపై దాడులకు దిగారు. గతంలో చెర్లోపల్లి, ప్రస్తుతం సామిరెడ్డి పల్లి ఇలా వరుసగా దళితులపై కూటమి ప్రభుత్వం కక్షగట్టి దాడులకు దిగుతున్నా ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని దళిత సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.



సామిరిరెడ్డిపల్లి దళితవాడ రోడ్డు నిర్మాణ పనులను అడ్డుకుంటున్న కూటమి నాయకులు



చెర్లోపల్లి దళితవాడకు వెళ్లకుండా రోడ్డుకు అడ్డంగా కొట్టిన ట్రెంచ్

ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగితే చర్యలు

నగరి: ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగేలా వ్యవహరిస్తే చర్యలు తప్పవని చిరువ్యాపారులకు సీఐ విక్రమ్ హెచ్చరికలు జారీచేశారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో చిరు వ్యాపారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారం కోసం రోడ్డుపై ఎక్కడ పడితే అక్కడ షాపులు పెట్టుకొనే చిరువ్యాపారులు కారణంగా ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందన్న అంశాన్ని ఆలోచించడం లేదన్నారు. ఎక్కువగా తోపుడు బండ్ల వారు, కొబ్బరికాయలు అమ్మేవారు రోడ్డు పైనే బండ్లు పెట్టేస్తున్నారని అది మంచి పద్ధతి కాదన్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగని ప్రదేశాల్లో విక్రయించుకోవాలన్నారు. తొలిసారి కనుక హెచ్చరికలతో వదలిపెడుతున్నానని మరోసారి ట్రాఫిక్ సమస్యకు కారణమైతే న్యూసెన్స్ యాక్ట్‌లో బుక్ చేయాల్సి ఉంటుందన్నారు.



చిరువ్యాపారులకు సూచనలు ఇస్తున్న సీఐ





వడమాలపేట : శ్రీరాముని కల్యాణ వేడుకలు, స్వామి వారి కల్యాణోత్సవాలను తిలకిస్తున్న భక్తులు

వైభవంగా సీతరామ కల్యాణం

వడమాలపేట(విజయపురం): వడమాలపేట మండల కేంద్రం శ్రీసంజీవి రామ దేవాలయంలో గురువారం సీతరామ కల్యాణం మహోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం 8 గంటలకు శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామివార్ల ఉత్సవమూర్తులకు విశేష ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. 11.50 నుంచి 12.30 మధ్య అభిజిత్ లగ్నమందు సీతారాములకు మాంగల్యధారణ చేపట్టారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు తలంబ్రాలు, పసుపుధారణ, గాజులు, ప్రసాదాలను భక్తులకు ఇచ్చారు. మధ్యాహ్నం 500 మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 3గంటలకు వసంతోత్సవం నిర్వహించారు. సాయంత్రం 6గంటలకు ఊంజల్ సేవ, రాత్రి 7గంటలకు పుష్పయాగం, తులసీదళ సహస్ర నామార్చన, విశేష హారతులు ఇచ్చారు.

IN THE COURT OF THE SUB-ORDINATE JUDGE AT TIRUTTANI
I.A.No:03/2023 in O.S.No:142/2021
Ramaraju and two others
...Petitioners/Plaintiffs
Versus
Venkatamma W/o K.Ramaraju
No:2/11 Papanalli Village, Kothandagari palli Post, Chittoor District
...Respondent/5th Defendants
The above said case the petitioners/plaintiffs filed for declaration and consequential injunction suit as against respondents/defendants in O.S.No. 142/2021 and the above suit is pending till this date and in mean time the 2nd defendant died and steps taken by the petitioners/plaintiffs and also that the petitioners/plaintiffs filed an implead petition in I.A.No.03/2023 as against you. The above suit stands posted on 28.04.2025 for your appearance. Hence you have to appear on that date at about 10.00 A.M. before the Hon'ble sub-ordinate Judge at Tiruttani for your appearance, failing which the above matter will be decided in ex-party manner.
Mu.Prakash, M.A., L.L.B.,B.Ed.,
Advocate for Petitioner / Plaintiff
Sholinghur Road, Pallipet Town & Taluk
Thiruvallur Dist-631207

గ్రావెల్ మాఫియా ఆగడాలు

అధికార పార్టీ నాయకుల ఆగడాలు రోజురోజుకూ హెచ్చుమీరుతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తవ్వి తరలిస్తున్నారు. అడ్డగోలుగా గ్రావెల్ తరలించి కోట్లు సంపాదిస్తున్నారు. మండల కార్యాలయాలకు కూత వేటు దూరంలో అక్రమంగా మట్టిని తవ్వి తరలిస్తున్నా.. అధికారులు మామూళ్లు తీసుకొని మౌనంగా ఉంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

- అధికార పార్టీ అండదండలతో అడ్డగోలు తవ్వకాలు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

విజయపురం: మండలంలోని జంబాడలో గ్రావెల్ మాఫియా రెచ్చిపోతోంది. వారం రోజులుగా రాత్రి, పగలు తేడా లేకుండా అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నారు. రోజుకి 80 నుంచి వంద లారీలు వెళుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. జంబాడ నుంచి కేశవపురం మీదుగా తమిళనాడుకు తరలిస్తున్నారు. నాణ్యమైన గ్రావెల్ టిప్పర్‌కు సుమారు రూ.8వేలు నుంచి రూ.10వేల వరకు దూరాన్ని బట్టి అధికార పార్టీ నేతలు విక్రయిస్తున్నారు. భారీగా అక్రమార్జనకు అవకాశం ఉండడంతో టీడీపీ నాయకులు అనుమతులతో పని లేకుండానే యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు సాగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.



జంబాడలో గ్రావెల్ తరలిస్తున్న ప్రవేశం

కూతవేటు దూరంలో..

మండల కార్యాలయానికి కూత వేటు దూరం జంబాడలో వారం రోజులుగా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయి. పగలు, రాత్రి టిప్పర్ల ద్వారా గ్రావెల్ తరలిస్తున్నా, మాముళ్ల మత్తులో అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానిక ప్రజలు అధికారులపై విమర్శలు గుప్పిస్తున్నారు.

తమిళనాడులో నిషేధం

తమిళనాడులో ఇసుక, గ్రావెల్ తవ్వకాలు నిషేధం అమల్లో ఉంది. దీంతో ఇక్కడి గ్రావెల్‌కు అక్కడ మంచి గిరాకీ ఉంది. ఇదే అదనుగా రోజుకు వందలాది టిప్పర్లలో ఇక్కడి నుంచి గ్రావెల్ తరలిస్తున్నారు. అనుమతికి మించి తవ్వకాలు జరుపుతున్నారని, ఆయా ప్రాంతాల్లో మైనింగ్, రెవెన్యూ అధికారులు కొలతలు తీసి లెక్కకట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు. టిప్పర్ల రాకపోకలకు రోడ్లు ధ్వంసమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అడ్డుకుంటే కేసులు పెట్టి వేధిస్తామంటూ స్థానికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు.

ప్రమాదకరంగా గుంతలు

గ్రావెల్ తవ్వకాలతో 40 అడుగుల లోతు వరకు గోతులు ఏర్పడుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమీప గ్రామాల్లోని ప్రజలు ప్రమాదవశాత్తు ఆ గుంతల్లో పడే ప్రమాదాలున్నాయి. విచ్చలవిడిగా ప్రకృతి సంపదను తవ్వేస్తున్నారని విపక్ష పార్టీల నేతలు ఆరోపిస్తున్నారు. దీనిపై తహసీల్దార్ కిరణ్‌ను వివరణ కోరగా జంబాడకు చెందిన రైతులు తన సొంత పొలంలో గ్రావెల్ తవ్వుకోవడానికి అనుమతి తీసుకొన్నారని చెప్పారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
గంగాధర నెల్లూరు : 95539 55610
నగరి : 95539 55609